www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 26 జూన్ 2023

5

కాకినాడ

నేడు డయల్ యువర్ కలెక్టర్, స్పందన

ప్రజాశక్తి-కాకినాడ

సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కతికా శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్ 18004253077కు ఫోన్ చేసి జిల్లా కలెక్టర్‌కు తెలియజేయవచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా జిల్లా స్థాయి స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకార కార్యక్రమం యథాతథంగా ఉదయం 10.30 గంటల నుంచి జరుగుతుందని, అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో సూచించారు.

అగ్రి ల్యాబ్స్ సేవలు గగనం

- లక్ష్యానికి దూరంగా అగ్రి ల్యాబ్స్
- రైతులకు అవగాహన కల్పించని అధికారులు
- ఎరువుల నాణ్యతను పరిశీలించే జల్దాల్ యూనిట్

జగ్గంపేట అగ్రి ల్యాబ్స్‌లో నాణ్యత పరీక్షలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

రైతుల సంక్షేమానికి ఎన్నో చేస్తున్నామని వైసిపి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటోంది. కానీ క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా ఇంతవరకు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయలేదు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు మార్కెట్లో పతనం అయినపుడు రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేయడం లేదు. ఉద్యాన పంటలకు మూడేళ్లపాటు ఎటువంటి రాయితీలు ఇవ్వలేదు. ఇవన్నీ అటుంచితే... ఎరువులు, విత్తనాల నాణ్యతను పరీక్షించేందుకు ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. జగ్గంపేట మండలంలో మూడేళ్ల క్రితం నిర్మాణం ప్రారంభించిన జిల్లాస్థాయి అగ్రి ల్యాబ్ ఒక్కటే అందుబాటులో ఉంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున ప్రభుత్వం ఏర్పాటు చేస్తానని చెప్పి ఏడాదిన్నర క్రితం ప్రారంభించినప్పటికీ ఇంతవరకు పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి రాలేదు. శంఖవరంలో పనుల్లో ఉన్న ల్యాబ్‌కు పరీక్షలకు అవసరమైన పరికరాలు రాలేదు.

రైతులు కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యత తెలుసుకునేందుకు, భూసార పరీక్షలు చేసేందుకు గ్రామీణ ప్రాంతంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక అగ్రి ల్యాబ్, జిల్లా స్థాయిలో మరో ల్యాబ్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రకటించింది. వీటిల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు రక్త పరీక్షలు, ఇతర వ్యాధుల నిర్ధారణ పరీక్షలు కూడా నిర్వహిస్తామని పేర్కొంది. కాకినాడలో జిల్లాస్థాయి అగ్రి ల్యాబ్ ఏర్పాటుచేయాలని అధికారులు నిర్ణయించారు. 2019 జగ్గంపేట, శంఖవరం మండలాల్లో ల్యాబ్ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. జగ్గంపేటలో నిర్మాణం పూర్తయ్యి రైతులకు అందుబాటులోకి వచ్చినా, జిల్లాలో ఇప్పటివరకు మరొక ల్యాబ్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేయకపోవడం పట్ల ఆంతర్యం ఏమిటో అర్థం కాలేదు.

ల్యాబ్‌లో పరీక్షలకు, పరిశోధనలకు అవసరమైన పరికరాలు చాలా రోజుల వరకు రాలేదు. పరికరాలు వచ్చిన తరువాత కూడా సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. జగ్గంపేట ల్యాబ్‌లో మార్చి నెల నాటికి 451 రకాల విత్తన నమూనాలు, 301 రకాల ఎరువులు నమూనాలను పరీక్షలు జరిపి రైతులకు సమాచారం అందించినట్లు సిబ్బంది చెబుతున్నారు. ల్యాబ్‌లో నత్రజని ఎరువు నాణ్యత పరీక్షల కోసం ఆధునాతన జలాల్ యూనిట్, విత్తనాల నాణ్యతను తెలిపే సీడ్ డివైడర్. విత్తన తేమ శాతాన్ని నిర్ధారించే హాట్ ఎయిర్ ఓవెన్‌తో పాటు పలురకాల రసాయనాలు అందుబాటులో ఉన్నాయి. అయితే రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో ఇవి నిరుపయోగంగా మారుతున్నాయి.

అందుబాటులోకి రాని కేంద్రాలు

జిల్లాలో శంఖవరం మండలం అగ్రి ల్యాబ్ భవన నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదు. భవన నిర్మాణాలకు రెండేళ్లుగా నిధులు విడుదలలో ఇప్పటివరకు ప్రభుత్వం జాప్యం చేసింది. ఇప్పుడు నిధులు విడుదల చేసిన నిర్మాణాలు పూర్తయ్యేసరికి ఎంత సమయం వెచ్చించాలనేది ప్రశ్నార్థకరంగా మారింది. అగ్రిలకు సంబంధించిన పరికరాలను కూడా ప్రభుత్వం ఇంకా పంపించకపోవడం ప్రతి నియోజకవర్గంలోనూ ఇంకా పనులు పూర్తిస్థాయిలో పనులు పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు.

ముగిసిన రాష్ట్రస్థాయి పెంటాథ్లాన్ క్రీడలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో రాష్ట్రస్థాయి మోడరన్ పెంటాథ్లాన్ క్రీడలు విజయవంతంగా ముగిశాయని మోడరన్ పెంటాథ్లాన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ క్రీడల్లో లేజర్ రన్ విభాగంలో విశాఖపట్నం జిల్లా మొదటి స్థానంలోనూ, కాకినాడ జిల్లా రెండో స్థానంలోనూ, చిత్తూరు జిల్లా మూడో స్థానంలోనూ, భయాథ్లాన్ విభాగంలో కాకినాడ జిల్లా మొదటి స్థానంలోనూ, విశాఖపట్నం జిల్లా రెండో స్థానంలో, చిత్తూరు జిల్లా మూడో స్థానంలో నిలిచాయి, ట్రైయాథ్లాన్ విభాగంలో విశాఖ జిల్లా మొదటి స్థానంలోనూ కాకినాడ జిల్లా రెండో స్థానంలోనూ చిత్తూరు జిల్లా మూడో స్థానంలోనూ నిలిచాయి. విజేతలుగా నిలిచిన టీం సభ్యులకు ముఖ్య అతిథులు డిఎస్‌డిఒ చీఫ్ కోచ్ బి శ్రీనివాస్ కుమార్, మోడరన్ పెంటాథలాన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, అలయన్స్ క్లబ్స్ వైస్ గవర్నర్ అల్లె వనుం శ్రీనివాసరావు ట్రోఫీలు అందజేశారు. లేజర్ రన్, భయథ్లాన్, ట్రయాథ్లాన్ విభాగాల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పాల్గొన్న అందరికీ డిఎస్ఎ స్టేడియం చీఫ్ కోచ్ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చి ఈ క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు అందరికీ అభినందనలు తెలియజేసి వచ్చే నెలలో అహ్మదా బాద్‌లో జరిగే జాతీయ స్థాయి క్రీడాలకు ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు తెలియజేసి జాతీయస్థాయి క్రీడల్లో విజేతలుగా నిలిచి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ క్రీడలను రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోటపాటి కృష్ణ విజయవంతంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా కోచ్ కట్టా జగన్మోహన్ కిశోర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వనుం ఉపేంద్రనాథ్, స్వాతి హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షులు అల్లె కిరణ్ కుమార్, అలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ ట్రెజరర్ అల్లె కె.సతీష్ ఈవెంట్ ఆర్గనైజింగ్ సభ్యులు పైల అనంత కుమార్, వెలుగుబంట్ల వెంకటరమణ, డిఎస్ఎ స్టేడియం స్విమ్మింగ్ కోచ్ రాజా షేక్ పాల్గొన్నారు.

పతకాలు అందిస్తున్న ప్రతినిధులు

పంట కాల్వలోకి రొయ్యల వ్యర్థ జలాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఒకపక్క సాగునీరు అందక రైతాంగం ఇబ్బందులు పడుతుంటే, మరోపక్క రొయ్యల కంపెనీ వ్యర్థజలాలు పంట కాలువల్లోకి వదిలి సాగునీటి కాలువలను పాడు చేస్తున్నారు. కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం కోరంగి పంచాయతీ పెద బొడ్డు వెంకటయ్యపాలెం గ్రామ పరిధిలోని పంట కాలువలోకి అపెక్స్ రొయ్యల కంపెనీ వ్యర్థ జలాలను వదిలి పంట కాలువ నాశనం చేస్తున్నారని స్థానిక ఎంపిటిసి పాలెపు చిన పోసయ్య , కోరంగి ఉపసర్పంచ్ కామాడి భైరవమూర్తి తెలిపారు. ఆదివారం వంటకాలువ వద్ద విలేకరులతో వీరు మాట్లాడారు. అపెక్స్ కంపెనీ మ్యాన్‌హోల్ లోంచి వదిలిన వ్యర్థ జలాల వల్ల తాగునీరు కలుషితం అవుతోందన్నారు. ఇదే పంట కాలువ ద్వారా చిన్నబొడ్డు వెంకటయ్యపాలెంలోని రక్షిత తాగునీటి పథకంలో కొళాయి చెరువులోకి సాగునీరు మళ్లించి తాగునీటిగా ఉపయోగిస్తున్నామని తెలిపారు. మూడు రోజుల క్రితమే కంపెనీ వ్యర్థ జలాలు పంట కాలువలోకి వదిలిన నీటిపారుదల శాఖ అధికారులు నేటి వరకు ఆ కంపెనీపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. రొయ్యల కంపెనీ యొక్క మ్యాన్ హోల్ శాశ్వతంగా మూసి వేయించాలని, పంట కాలవలోకి వ్యర్థ నీరు వదిలినందువల్ల కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వీరు డిమాండ్ చేశారు.

పంట కాల్వలోకి వదిలిన వ్యర్థ జలాలు

చదవడం మాకిష్టంలో విద్యార్థులు

గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

విద్యార్థులకు విజ్ఞానం పెంపొందించేందుకు గ్రంథాలయాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని గాంధీనగర్ శాఖ లైబ్రరీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం గాంధీనగర్ గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తకాల చదవడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఎంఎల్ఎ చినరాజప్పకు పలువురి పరామర్శ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

శనివారం రాత్రి ఏలూరు సమీపంలోని బత్తులవారిగూడెంలో బస్సు యాత్ర ప్రచార వేదిక కూలడంతో స్వల్పంగా గాయపడిన పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్పను పలువురు ఆదివారం పరామర్శించారు. మండలంలోని అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ చినరాజప్పను టిడిపి రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ కలసి పరామర్శించారు. పరామర్శించిన వారిలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అప్పలరాజు, టిడిపి పట్టణ కార్యదర్శి బడుగు శ్రీకాంత్, భీమేశ్వరాలయం మాజీ ట్రస్టుబోర్డు సభ్యుడు బాడితమాని త్రిమూర్తులు, పట్టణ, మండల పరిధిలో పార్టీ నాయకులు, కాకినాడ, పెద్దాపురం, అమలాపురం నుండి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు కార్యకర్తలు చినరాజప్పను పరామర్శించారు.

చినరాజప్పను పరామర్శిస్తున్న నాయకులు

రక్తదానం చేస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా వనమాడి పుట్టినరోజు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

టిడిపి మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు జన్మదిన వేడుకలను ఆదివారం నగరంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు అంబటి చిన్న ఆధ్వర్యంలో రేచర్ల పేటలో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్‌ను నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. కాకినాడ జిజిహెచ్ వద్ద గల ఎన్టీఆర్ బస్టాప్, భానుగుడి, జగన్నాధపురం సినిమా రోడ్ తదితర ప్రాంతాల్లో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఎం.డి అన్సర్, ఎస్‌కె.రహీమ్ ఆధ్వర్యంలో జగన్నాధపురం, ఆజామ్ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మదర్సా విద్యార్థులకు విందు ఏర్పాటు చేశారు. గుమ్మళ్ల చిన్న ఆధ్వర్యంలో భానుగుడిలో కేక్ కట్ చేసి అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గదుల సాయిబాబా, కొల్లాబత్తుల అప్పారావు, సామంతుల నాగేంద్ర కుమార్, బంగారు సత్యనారాయణ, తుమ్మల రమేష్, ఎండి ఆన్సర్, మీసాల సునీత, చింతలపూడి రవి, జొన్నాడ వెంకటరమణ, బత్తుల ఉమాదేవి, కోడూరు కుమారస్వామి, పొంగ బుజ్జి, షేర్ శ్రీను, చొక్కా గిరి అమలకంటి బలరాం, తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఐఇఇఇ వైజాగ్ బే సెక్షన్‌తో సంయుక్తంగా నిర్వహిస్తున్న అడ్వాన్స్‌డ్ గ్లోబల్ ఇంజనీరింగ్ ఛాలెంజెస్‌పై అంతర్జాతీయ సదస్సు ఫలప్రదంగా విజయవంతంగా ముగిసినట్లు ఆదిత్య క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలల డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సు ముగింపు ఉత్సవానికి ముఖ్య అతిథిగా ఆంధ్రా ఎలక్ట్రికల్స్ సిఇఒ కె.శ్రీధర్, పాల్గొని సదస్సులో ప్రధాన ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఇలాంటి కాన్ఫరెన్స్ అవశ్యకత ఎంతైనా అవసరం ఉందన్నారు. నేటి ఇంజనీరింగ్ సవాళ్లపై జ్ఞానాన్ని పొందడంలో సహాయపడుతుంది. యువత పరిశోధనల ద్వారా సుస్థిరత అభివద్ధిని అర్థం చేసుకోవాలి. సుస్థిర అభివద్ధి అనేది ఔషధం, నానో, రోబో, టెక్నో, మొబైల్ అప్లికేషన్ మొదలైన వివిధ రకాల సాంకేతికతలు సాధించాలి. సమాజంలో సాంకేతికత ఆధారంగా విద్యను పెంచాలి అని చెప్పారు. భావి ఇంజనీర్లు కొలువుల కొరకు ఎదురు చూడకుండా ఎంటర్ప్రెన్యూర్షిప్, ఇన్నోవేషన్‌పై దృష్టి పెట్టాలన్నారు. ఆదిత్యలో ఈ రకమైన మొదటి ఐఇఇఇకాన్ఫ్ అన్నారు. ఎన్ఐటి ఎపిఎన్ఐటి. ఢిల్లీ నుండి పేపర్ రచయితలు వచ్చారు. ఎన్ఐటి జంషెడ్‌పూర్ (2), జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయం, ఎస్ అర్ ఎం, విఐటి, చండీగఢ్ విశ్వవిద్యాలయం, ఎన్‌బికెఆర్, విద్యానగర్, గీతం, ఎస్ఆర్ విశ్వవిద్యాలయం, వరంగల్, న్యూ హారిజన్ బంగోర్, నియోటియా విశ్వవిద్యాలయం నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. పవర్ ఎలక్ట్రానిక్స్, మొబైల్ రోబోట్స్, మెషిన్ లెర్నింగ్, ఇమేజ్ ఫ్యూజన్, ఎంబెడెడ్ సిస్టమ్స్, 5జి కమ్యూనికేషన్స్ విభాగాల్లో పేపర్లు సమర్పించారు. 34 మంది పరిశోధకులు పత్రాలను సమర్పించారు. డీన్ డాక్టర్ కెవిఎస్ఆర్.మూర్తి ఆర్గనైజింగ్‌లో రెండురోజుల సదస్సు విజ్ఞానదాయకంగా ముగిసింది. సదస్సులో పాల్గొన్న పరిశోధన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రొఫెసర్స్ ఆదిత్య ఆతిథ్యం మరువలేనిదని నిర్వహణ బాగుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ డోలా సంజయ్ ఎస్. డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డీన్ లు డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ కె.వి.ఎస్.ఆర్.మూర్తి, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

మరిడమ్మ జాతరలో యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి - పెద్దాపురం

37 రోజులపాటు జరిగే మరిడమ్మ జాతర సందర్భంగా 2వ ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు అమ్మవారిని దర్శించుకునేందుకు రావటంతో ఆలయ పరిసరాలన్నీ జనంతో నిండిపోయాయి. క్యూలైన్లలో గంటల తరబడి యాత్రికులు ఇబ్బందులు పడకుండా వేగవంతంగా అమ్మవారిని దర్శించుకునేలా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్. రామ్మోహనరావు చర్యలు తీసుకున్నారు. ఎస్ఐ వి.సురేష్ ఆధ్వర్యంలో ఆలయం సమీపంలో ఉన్న ప్రధాన రహదారిలో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ దావీదు రాజు ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది ఆలయ పరిసరాల్లో పనులు నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ ఆలయంలో యాత్రికులకు సేవలను పర్యవేక్షించారు.

ఆలయంలో కిక్కిరిసిన యాత్రికులు

చెరువులా ఇర్రిపాక రోడ్డు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని రామవరం నుండి మర్రిపాక, ఇర్రిపాక గ్రామాలకు వెళ్లే రోడ్డు కాస్తా చెరువులను తలపిస్తోంది. రామవరం 16 నెంబర్ జాతీయ రహదారి నుండి ఉన్న రోడ్డు కాస్తా గుంతల మయంగా మారింది. సుమారు మూడు కిలోమీటర్ల మేర గుంతల్లో నీరు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గోతులు లోతుగా ఉండటంతో వాటిలో వాహనాలుపడి పాడైపోతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఈ రోడ్డు పాడై ఏళ్ల గడుస్తున్నా మరమ్మతులు చేపట్టడం లేదని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు రిపేరు పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

చెరువులా ఉన్న రోడ్డు

ఒరిగిన విద్యుత్ స్తంభం.. జనం భయాందోళనలు..

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక అంకయ్యపేట - మంగళవారం పేట సెంటర్‌లోని బసవేశ్వర స్వామి గుడి వద్ద ఉన్న విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగి ప్రజలను భయాందోళనలకు గురి చేస్తోంది. ఈ స్తంభం నుంచి వేసిన విద్యుత్తు లైన్లు స్తంభం పక్కగా ఉండటంతో ఈ స్తంభం రోజురోజుకు పక్కకు ఒరుగుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తూ గాలి వానలు వస్తున్నాయని, ఈ గాలి వానలకు విద్యుత్తు స్తంభం పడిపోతుందేమోనని ప్రజలు భయపడుతున్నారు. వెంటనే మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు, సచివాలయం సిబ్బంది స్పందించి ఈ విద్యుత్ స్తంభాన్ని సరి చేయించాలని ఆ ప్రాంత ప్రజలు విజ్ఞప్తి చేశారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం

కార్టూ'నిజం'

సాగనున్న తొలకరి ఏరువాక

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఎట్టకేలకు సామర్లకోట మండలంలో ఈ సీజన్ వర్షాకాలంలో మొదటి వర్షం కురిసింది. శనివారం అర్ధరాత్రి నుండి ఆదివారం మధ్నాహ్నం వరకూ సామర్లకోట పట్టణ, మండల పరిధిలో వర్షం కురిసింది. సుమారు 21.00 ఎంఎం వర్షపాతం నమోదు అయ్యింది. ఇప్పటికే ముందస్తు సాగు పనులు రైతులు చేపట్టాల్సి ఉండగా, రుతుపవనాలు ఆలస్యంగా రావడం, వర్షాలు కురియడం మరింత జాప్యం కావడంతో తొలకరి ఏరువాక పనులకు రైతులు ముందుకు రాలేదు. ఎట్టకేలకు ఆదివారం కురిసిన వర్షంతో రైతులు అరక కట్టి ఏరువాక పనులకు సన్నద్ధం అవుతున్నారు. మండలంలోని జి.మేడపాడు, వేట్లపాలెం గ్రామాల రైతులు తొలకరి సీజనుకు అవసరమైన నారు మడులు తయారు చేసే పనులు చేపట్టారు. నారు మడులను ట్రాక్టర్‌లతో దుక్కిదున్నే పనులు చేపట్టారు. ఇప్పటికే నారు మడులు తయారు కావల్సి ఉండగా, ఈ వేసవిలో జూన్ నాలుగో వారం వచ్చినా వర్షాలు పూర్తి స్థాయిలో కురవని పరిస్థితి నెలకొంది. ఖరీఫ్‌లో వరుస తుపానులు, వర్షాల నుండి పంట నష్టాలను చవిచూసిన రైతులు ప్రస్తుతం వాటి నుండి తేరుకుని వర్షాలు ప్రారంభం కావడంతో తొలకరి సాగుకు సన్నద్ధం అవుతున్నారు. రాయితీపై రైతులకు అసవరమై విత్తనాలను ఆర్‌బికెల్లో సిద్ధంగా ఉంచినట్లు వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. ఎంటియు 7029, 1318, ఎరువులు యూరియా, నత్రజని డిఎపి కాంప్లెక్స్ ఎరువుల స్టాకులను కూడా సిద్ధం చేసినట్లు చెబుతున్నారు. ఎట్టకేలకు వర్షాలు కురవడం ప్రారంభం కావడంతో తొలకరి సాగు పనులకు రైతు సన్నద్ధం అవుతున్నాడు.

వేట్లపాలెంలో సిద్ధమైన నారుళ్లు

ప్రమాదానికి గురైన ఆటో

ఈ రోడ్డులో ప్రమాదాలు సర్వసాధారణం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేశ్వరం మండలంలోని రమణయ్యపేట-జె.అన్నవరం గ్రామాల మధ్య రహదారి మూడేళ్లుగా అధ్వానంగా తయారయ్యింది. ఈ రహదారిపై ప్రయాణం అంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. ఇటీవల మరింత అధ్వానంగా మారడంతో కొన్ని రోజులుగా ప్రతిరోజు ఏదో వాహనం ప్రమాదానికి గురవుతూనే ఉన్నాయి. ఈ రహదారి గుండా అనునిత్యం ఏజెన్సీ కెళ్లే వందలాది వాహనాలు ప్రయాణిస్తాయి. ఇటీవల ఆర్‌టిసి బస్సు స్టీరింగ్ విరిగి పెను ప్రమాదం తటిలో తప్పింది. శుక్రవారం రైతులకు ఎరువులు తీసుకెళుతున్న ఆటో మధ్యలోకి విరిగిపోయి ఎరువులు తరలించలేని పరిస్థితి ఏర్పడింది. ఆదివారం పాసింజర్ ఆటో అకస్మాత్తుగా విరిగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రజలు ప్రజా సంఘాలు ఎన్నిసార్లు నిరసనలు తెలిపిన అధికారులకు సీమకుట్టినట్టైనా లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఈ రహదారి నిర్మాణాలు చేపట్టకపోతే అనేక ప్రమాదాలు సంభవించే అవకాశాలు లేకపోలేదు.

విరగ కాసిన మునగ

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం కోరంగిలోని మాజీ ఎంపిటిసి వైదాడి శ్రీనివాస్ కోళ్ల ఫారంలో మునగ చెట్టు విరగ కాసింది. హైబ్రిడ్ రకం మునగ తన కోళ్ల ఫారంలో ఏడాది క్రితం నాటినట్లు తెలిపారు. కోళ్లపెంట ఎరువుగా వేయడంతో చెట్టు అంతటా ప్రతి కొమ్మా మునగ కాడలతో విరబూసిందని శ్రీనివాస్ ఆనంద వ్యక్తం చేశారు. ఈ మునగ కాడలను తన స్నేహితులకు ఆయన ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు

వ్యవసాయ శాఖ జెడి విజయ్‌కుమార్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఖరీఫ్ 2023 సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచినట్లు కాకినాడ జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. జూన్1వ తేదీ నుంచి పంట కాలువలకు నీరు విడుదల చేశారని జిల్లాలో ఈ ఏడాది 2,27,442 ఎకరాల్లో వరి సాగు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఖరీఫ్ సాగు సన్నద్ధపై ఆయన పలు అంశాలను ప్రజాశక్తికిచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

ఎన్ని విత్తనాలు అందుబాటులో ఉన్నాయి..

ఈ సీజన్లో మొత్తం పంటకు 68,281 క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉన్నాయి. 13,204 క్వింటాళ్లు ప్రైవేటు డీలర్లు వద్ద, 532 క్వింటాళ్లు సొసైటీల్లో అందుబాటులో ఉన్నాయి. రైతు భరోసా కేంద్రాలలో 3,475 క్వింటాళ్లు అందుబాటులో ఉంచాము. ప్రస్తుతం సుమారు 150 ఎకరాల్లో నారుమడులు పూర్తి అయ్యాయి.

రాయితీపై విత్తనాలు అందిస్తారా..

ఖరీఫ్ లో ఆయా ప్రాంతాల్లో సాగు చేసే పంటలను బట్టి అవసరమైన విత్తనాలను ప్రభుత్వం రాయితీపై ఇచ్చే విధంగా చర్యలు చేపట్టింది. వరి సాగుచేసే వారికి ఎంటియు-7029, ఎంయుటి-1318, ఆర్ఫీ బయో 276 తదితర రకాల విత్తనాలను, సబ్సిడీ విత్తనాలు సిద్ధం చేస్తున్నారు. 25 శాతం ఎరువులు, విత్తనాలను ఆర్బీకేల ద్వారా పంపిణీ చేస్తారు.

ఎరువులు ఎంత వరకూ అందుబాటులో ఉన్నాయి..

65,625 మెట్రిక్ టన్నులు అవసరం కాగా యూరియా 11,120 మెట్రిక్ టన్నులు, డిఎపి 2449 మెట్రిక్ టన్నులు, ఎంఒపి 815 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పి 1001 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 4138 మెట్రిక్ టన్నులు, మొత్తంగా 21,827 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి. సమయానుసారంగా మిగిలిన ఎరువులను కూడా అందుబాటులో ఉంచుతాం.

రైతులకు ఏ విధమైన ప్రణాళిక ఇచ్చారు.?

ఈ నెల 15 నుంచి 20 వ తేదీ వరకూ నారుమళ్లు సిద్ధం చేసుకోవాలని, వెదజల్లు సాగు చేసుకోవాలని, జూలై 15 నుంచి 20 లోపు నాట్లు వేయడాన్ని పూర్తి చేయాలని, అక్టోబర్ 31 నాటికల్లా కోతలు పూర్తి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశాము. తూర్పు డెల్టాతో పాటు ఏలేరు, పంపా, తాండవ, పుష్కర ఎత్తిపోతల పథకాల క్రింద ఆయకట్టు,మెట్ట మండలాల్లో రైతులు వరి సాగుకి సన్నద్ధం అవుతున్నారు.

నిర్మాణాల్లో నిర్లక్ష్యం.. ప్రమాదాల నిలయం..

ప్రజాశక్తి-మామిడికుదురు

నదీ తీర లంక గ్రామాలలో వరదల సమయాలలో భారీ వర్షాల సమయాలలో ప్రజలు ఇబ్బందులు గురి కాకుండా సిమెంటు కాంక్రీట్ రోడ్లు నిర్మించారు. ఈ రోడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వ్యవహరించడంతో అవి ప్రమాద నిలయాలుగా మారాయి. రూ.కోట్లు వెచ్చించి సింగిల్ లేన్, ఇంటర్మీడియట్, డబుల్ లేన్, సిసి రోడ్లు నిర్మిస్తున్నారు. ఈ రోడ్ల కి రెండు వైపులా మీటర్ వెడల్పు గ్రావెల్ ఏర్పాటు చేయవలసి ఉండగా వాటిని విస్మరించి కొన్నిచోట్ల మట్టితో బెర్మలు ఏర్పాటు చేసి, మరికొన్ని చోట్ల బెర్మలు గాలికి వదిలేశారు. ఆ బెర్మలు ఏర్పాటు అంచనా నిధులు స్వాహకు పాల్పడ్డారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్లకు నాణ్యతకి సంబంధించి నిబంధనలు గాలికి వదిలేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

అగాధం అంచున అప్పనపల్లి బాడవ సిసి రోడ్డు

గత ప్రభుత్వ హయాంలో మొల్లేటివారిమెరక, అప్పనపల్లి బాడవ, ఉచ్చుల వారి పేట మీదుగా కరకట్ట సమీపం వరకు రూ.కోట్లు వెచ్చించి సుమారు మూడు కి.మీ మేర సిసి రోడ్డు నిర్మించారు. అప్పనపల్లి శివారు ప్రాంతమైన బాడవ, ఉచ్చులవారి ఎస్‌సి పేట, అరుంధతి పేట, వాసులకు ప్రయోజనం చేకూరింది. అంతే కాకుండా లంక గ్రామాలైన పెదపట్నంలంక, బి.దొడ్డవరం, అప్పనపల్లి, వాసులు మండల కేంద్రమైన మామిడికుదురు చేరుకునేందుకు దగ్గర మార్గం కావడంతో ఇటీవల ఈ రహదారులు రద్దీ ఏర్పడింది. గత నాలుగేళ్ల నుంచి వరుసగా వస్తున్న వరదలలో ఈ రహదారిపై నుంచి వరద నీరు పడమర నుంచి తూర్పు వైపు ప్రవహిస్తుండడంతో తూర్పు వైపు రహదారి మూడు కిలోమీటర్లు పొడవున మార్జిన్ కోతకు గురై అగాధాలుగా మారాయి. గత నాలుగేళ్ల నుంచి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పంచాయతీ అధికారులు పట్టించుకోక పోవడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సింగిల్ లేన్ రోడ్డు కావడంతో ఒకపక్క రోడ్డు బెర్మ్ వరద ప్రవాహ వేగానికి రెండు నుంచి నాలుగు అడుగులు లోతు మేర కోతకు గురిఅవుతోంది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించే క్రమంలో మరింతగా దిగితే అగాధం కావడంతో ముప్పు పొంచి ఉందనని వాహన దారులు ఆందోళన చెందు తున్నారు. దీనిపై సంబంధిత ఉన్నతా ధికారులు దృ ష్టి సారించి బెర్మ్‌లు పటిష్ట పరచాలని కోరుతున్నారు.

మలుపులో పొంచి ఉన్న ముప్పు

అప్పనపల్లిలో అధ్వానంగా ఉన్న సిసి రోడ్ బెర్మ్‌లు

రోడ్డు కుంగిపోయే పరిస్థితి ఉంది

ఈ రహదారి తూర్పు వైపు మీటరు లోతున మూడు కిలోమీటర్ల పొడవునా బెరములు వరద ఉధతిలో కోతకు గురై అగాధంగా మారింది. బెర్మను ప్రతిష్టం చేయకపోతే భారీ వాహనాల రాకపోకల సమయంలో రోడ్డు కుంగిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

- బొంతు సూర్య భాస్కరరావు, మాజీ సర్పంచ్, అప్పనపల్లి

రాతి కట్టతో బెర్మ్‌లు పటిష్టపరచాలి

వరద ప్రభావిత గ్రామంలో సిసి రోడ్డు కావడంతో తాత్కాలిక చర్యలతో కాకుండా రాతి కట్టతో బెర్మలు ప్రతిష్ట పరచాలి. రాతి కట్టకో పరచడం వల్ల వరదల సమయంలో మరింతగా కోతకు గురి కాకుండా సిసి రోడ్డు నాణ్యతకు రక్షణ కోసం నిలుస్తుంది. ఈ దిశగా అధికారులు దృష్టి సారించాలి.

– మొల్లేటి శ్రీనివాస్, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్, అప్పనపల్లి

నేరాలు ఘోరాలు

వివరాలు తెలుసుకుంటున్న సిఐ శ్రీనివాస్

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

శ్రీరాంపురం పంచాయతీ శివారుపాటి వారిపాలెం గ్రామానికి చెందిన పాతి రూపాదేవి (29) ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కాకినాడ రూరల్ మాధవపట్నానికి చెందిన రూపా దేవితో పాటివారిపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాస్ తో 2015 సంవత్సరంలో వివాహమైంది. ఆమెకి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల కాలంలో భర్త వేధింపులు తాళలేక అత్తగారి ఇంటిలోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు పిఠాపురం సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ప్రజాశక్తి అమలాపురం రూరల్

అమలాపురం రూరల్ మండలం రెడ్డిపల్లి పెట్రోల్ బంక్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆర్‌టిసి బస్సు ఢీకొన్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన మహిళను ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అమలాపురం తాలూకా పోలీసులు తెలిపారు.

గాయపడిన కార్మికుడు మృతి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలోని వేట్లపాలెంలో ఈ నెల 24న ఆదిలక్ష్మీ రైసు మిల్లులో జరిగిన ప్రమాదంలో గాయపడిన దడాల నూకరాజు (36) చికిత్స పొందుతూ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందాడు. సామర్లకోట పోలీసుల సమాచారం ప్రకారం ఆదిలక్ష్మి రైసు మిల్లులో కూలీగా పనిచేస్తున్న నూకరాజు రైస్ మిల్లు పైపులైన్‌లోకి ధాన్యం వెళ్ళే మార్గం మూసుకుపోవడంతో పైప్ లైన్ మార్గంను కియ్లర్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ పైనుంచి కింద పడ్డాడు. దీంతో అతని తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్సం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 24వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు మరణించినట్లు పోలీసులు చెప్పారు. మృతుని భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సామర్లకోట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాడుతున్న 8 మంది అరెస్ట్

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట పట్టణం ఉండూరు శివారు బ్రిడ్జి వద్ద పేకాడుతున్న 8 మందిని అరెస్ట్ చేసినట్లు సామర్లకోట సిఐ కె.దుర్గాప్రసాద్ చెప్పారు. వీరి నుంచి రూ.5400 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు.

స్వాధీనం చేసుకున్న మద్యం బాటిల్స్

234 మద్యం బాటిల్స్ స్వాధీనం

ప్రజాశక్తి -కరప

కరప మండలం ఉప్పలంక హైవే వద్ద 234 మద్యం బాటిల్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామకష్ణ తెలిపారు. ఈ మేరకు కరప ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు శనివారం కాకినాడ ఎస్‌పి సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఉప్పలం హైవేపై డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించమన్నారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా నక్కపల్లి మండలం చింతనర్ల గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు స్కూటీపై సుమారు రూ.20,166 విలువైన మద్యం సీసాలను తరలిస్తుండగా వారిని అదుపులో తీసుకున్నారు.

ఫ్లెక్సీల తొలగింపుపై టిడిపి నిరసన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ తెలుగుదేశం పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించడంపై ఆ పార్టీ నాయకులు ఆగ్రహ వ్యక్తం చేశారు. ఆ పార్టీ మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు మెయిన్ రోడ్‌లో తపాలా శాఖ కార్యాలయం వద్ద సుమారు రెండు గంటల పాటు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు మాట్లాడుతూ మాజీ ఎంఎల్ఎ కొండబాబు జన్మదిన వేడుకల్లో భాగంగా ఫ్లెక్స్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఒక్క రోజు కూడా ఉంచకుండా ఫ్లెక్సీలు తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. స్థానిక నాయకులు చెప్పిందే వేదంగా కార్పొరేషన్ నాయకులు పని చేయడం సరికాదన్నారు. తొలగించిన ఫ్లెక్సీలను యథావిధిగా కట్టాలని డిమాండ్ చేశారు.

పెంటాథ్లాన్‌లో పల్లవికి ప్రథమం

ప్రజాశక్తి - పెద్దాపురం

కాకినాడ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ క్రీడా మైదానంలో నిర్వహించిన 7 వ రాష్ట్రస్థాయి మోడ్రన్ పెంటాథ్లాన్ పోటీల్లో పెద్దాపురం మండలం రాయ భూపాలపట్నంకు చెందిన మన్యం పల్లవి అండర్ 11 క్యాటగిరిలో ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని 10 జిల్లాల నుండి 230 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో మూడు విభాగాల్లో పల్లవి ప్రథమ స్థానం సాధించడం విశేషం. ఈ సందర్భంగా పల్లవిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మోడ్రన్ పెంటాథ్లాన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చప్పిడి వెంకటేశ్వరరావు, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ శ్రీనివాసరావు, అసోసియేషన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బీమా సొమ్ము అందజేత

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

యండమూరు గ్రామ పరిధిలోని టిల్లపూడి సునీత మరణంతో ఆమె కుటుంబానికి అందాల్సిన ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం కింద రూ.రెండు లక్షలను డివిషనల్ సూపెరింటెండెంట్ డిఎస్.యు నాగేశ్వర రెడ్డి ఆదివారం అందజేశారు. ఎపిఎంజెజెబిఐవ పథకం పాలసీ ద్వారా ఖాతాదారులైన టిల్లపూడి సునీత గ్రామ పోస్ట్ మాస్టర్ నాగేశ్వరరావు సలహాపై పాలసీ తీసుకున్నారు. అనారోగ్య కారణాల వల్ల ఆమె మరణించడంతో ఆమె తల్లి లక్ష్మికి ఈ బీమా మొత్తాన్ని రెండు రూ.లక్షలు అందించినట్టు కాకినాడ డివిషనల్ సూపెరింటెండెంట్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు పిఎంజెజెబివై, పిఎంఎస్‌బివై బీమా పాలసీలను ప్రజలందరూ ఉపయోగించుకుని కష్టకాలంలో కుటుంబాలకు ఆసరా కలిపించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై గ్రామ ప్రజలకు మంచి అవగాహన కల్పిస్తున్న బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ నాగేశ్వరరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్.సూర్య ప్రకాష్, సిహెచ్.శ్రీనివాసు, ఎ.శ్రీనివాస్, బ్రాంచ్ మేనేజర్ శ్రీదేవి, బాలాజీ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందిస్తున్న సూపరింటెండెంట్

సమావేశంలో మాట్లాడుతున్న శేషారావు

27న టిడిపి ఆధ్వర్యంలో రథయాత్ర

ప్రజాశక్తి-పెరవలి

నెల 27న పెరవలి మండలంలో జరగబోవు భవిష్యత్ గ్యారెంటీ- చైతన్య బస్సు రథయాత్ర కార్యక్రమం ధిగా మాజీ ఎంఎల్ఎ, నియోజవర్గ టిడిపి ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. మండల టిడిపి విస్తతస్థాయి సమీక్ష సమావేశం పెరవలి గ్రామంలో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బూరుగుపల్లి శేషారావు హాజరై మాట్లాడుతూ ఈ నెల 27న నిర్వహించనున్న రథయాత్ర కార్యక్రమం విజయవంతంచేసే విషయమై చర్చించారు. ఈ యాత్ర మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నల్లాకులవారిపాలెం హైవే నుంచి ర్యాలీగా ముక్కామల మీదుగా ఖండవల్లి అన్నవరప్పాడు గ్రామలను కలుపుతూ హైవే మీదుగా నుంచి పెరవలిలో గల దీపిక కన్వెన్షన్ ఎసి ఫంక్షన్ హాల్‌కు చేరుకుంటుదన్నారు. అనంతరం సమావేశం నిర్వహిస్తామని ఈ సందర్భంగా రూట్ మ్యాప్ రూపొందించామన్నారు. మండలంలోని నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెరవలి మండల పార్టీ అధ్యక్షులు అతికాల వెంకట రామకష్ణమ్మ అధ్యక్షతన నిర్వహించగా పెరవలి వాటర్ డిస్ట్రిబ్యూటర్ మాజీ చైర్మన్ బూరుగుపల్లి శ్రీనివాస్, రాజమహేంద్రవరం పార్లమెంటు ఆర్గనైజింగ్ సెక్రెటరీ బొడ్డు రామాంజనేయులు మాజీ మండల అధ్యక్షులు సలాది కృష్ణమూర్తి, నియోజకవర్గ ఐ టిడిపి అధ్యక్షుడు అబ్బిశెట్టి సత్తిరాజు, మండల తెలుగు యువత అధ్యక్షుడు హనుమంతు సుబ్రహ్మణ్యం, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి వనితకు ఆహ్వాన పత్రిక అందజేత

ప్రజాశక్తి-తాళ్లపూడి

వేగేశ్వరపురంలో కెఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 75 వసంతాల వేడుక, 45 సంవత్సరాల కళాశాల వేడుకకు హాజరుకావాలని కోరుతూ హోం శాఖ మంత్రి తానేటివంతకు ఆహ్వాన పత్రికను ఆ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆదివారం అందజేసింది. ఈవిషయాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు సీర్ల సత్యనారాయణ తెలిపారు. గ్రామ సర్పంచ్‌తో కొమ్మి రెడ్డి పరశు రామారావుతో కలిసి మంత్రికి ఆహ్వాన పత్రం అందించినట్లు ఆయన తెలిపారు.

మంత్రికి ఆహ్వాన పత్రం ఇస్తున్న సభ్యులు


కార్డులు అందిస్తున్న ఎంఎల్ఎ వెంకట్రావు

సోషల్ మీడియా కార్యకర్తలకు ఇన్సూరెన్స్ ఐడి కార్డ్స్ పంపిణీ

ప్రజాశక్తి-దేవరపల్లి

ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా పాత్ర ఎంతో కీలకమని గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. దేవరపల్లి ఎంఎల్ఎ క్యాంప్ ఆఫీస్ వద్ద గోపాలపురం నియోజకవర్గ నాలుగు మండలాల సోషల్ మీడియా కార్యకర్తలకు సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ తలారి మాట్లాడుతూ గోపాలపురం నియోజవర్గంలో సమస్యలపై ఫేస్బుక్, వాట్సాప్ సామాజిక మాధ్యమాల ద్వారా వైయస్సార్ సోషల్ మీడియా పనిచేస్తుందని అన్నారు. అనంతరం గోపాలపురం నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్స్‌కి ఐడి కార్డ్స్, మరియు ఒక్కకరికి రూ.10 లక్షల ప్రమాద ఇన్సూరెన్స్ బాండు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి మండలం ఎంపిపి కెవికె.దుర్గారావు, గోపాలపురం ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, ఎఎంసీ ఛైర్మన్ గన్నమని జనార్దన్‌రావు, జెడ్‌పిటిసి సభ్యులు పి.స్వర్ణలత, సిహెచ్.శ్యామ్, రాష్ట్ర ఆతీరస కార్పొరేషన్ ఛైర్మన్ ఇళ్ళ భాస్కరరావు, వైసిపి నాయకులు, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కుసలూరి సతీష్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టు :: రాజమహేంద్రవరం

Tr.O.P.No. 116/2022

Between:

J.V.S.Suraj, S/o. J.V.S.Somaraju, Hindu, aged 29 Years, Business, Resident of D.No. 2-6-12, Madhavanagar, Kakinada, Kakinada J.C.J.C. ***...Petitioner***

AND

Mummidi Ashik and Others ***...Respondents***

R-3: Smt. Narla Mangatayaru, W/o. (Late) Pattabhiramayya, aged 57 Years, House Wife, Resident of D.No. 15-9-10, Satyaprasanna Nagar, Kakinada, Kakinada J.C.J.C.

R-8: Jetti Annapurna, W/o. Subbarao, aged 55 Years, House Wife, Resident of Flat No. S-16, Aiswarya Apartments, Venkataratnapuram, Kakinada, Kakinada J.C.J.C.

R-32: B.Venkataramana, S/o. Byra Satyavathi, aged 47 Years, Resident of D.No. 22-3-5, Deepalavari Street, Kakinada, Kakinada J.C.J.C.

R-33: B.Satyanarayana, S/o. Byra Satyavathi, aged 41 Years, Resident of D.No. 22-3-5, Deepalavari Street, Kakinada, Kakinada J.C.J.C.

పై నెంబరు ట్రాన్స్‌ఫర్ ఓ.పి.లో 3, 8, 32, 33 రెస్పాండెంట్సు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు /నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కావున **ది.07-07-2023 సం॥రం తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరు అయ్యి సదరు పై పిటీషనులో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను.** లేని ఎడల సదరు పిటీషను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కె.ఎస్.లక్ష్మీనారాయణ
సిహెచ్.శ్రీరామచంద్రమూర్తి

రాజమండ్రి, అడ్వకేట్స్, రాజమండ్రి.
25-6-23. సెల్: 98480 33710

యానాం వార్తలు

మాజీ సైనికుల పిల్లలకు బహుమతులు

ప్రజాశక్తి - యానాం

2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన మాజీ సైనికుల పిల్లలకు నగదు అవార్డును అందజేస్తున్నట్లు డిపార్ట్మెంట్ ఆఫ్ సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, పిజీ పరీక్షల్లో గోల్డ్ మెడల్ సాధించిన వారికి సైతం నగదు బహుమతి అందిస్తామన్నారు. అర్హులైనవారు ఈ నెల 28వ తేదీలోగా రిజిస్టర్ చేసుకుని దరఖాస్తును ఆగష్టు 4వ తేదీలోగా ఆర్ఎఓకు అందించాలన్నారు.

ఉచిత బేబీకేర్ సెంటర్‌లో ప్రవేశాలు ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

యానాం వద్దాశ్రమం ద్వారా నిర్వహిస్తున్న ఉచిత బేబీ కేర్ సెంటర్‌లో ప్రవేశాలు ప్రారంభించినట్లు సంస్థ నిర్వాహకుడు పెసల గంగయ్య తెలిపారు. మూడు నాలుగేళ్ల వయసున్న చిన్నారులను సెంటర్లో చేర్చితే ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వారి సంరక్షణ బాధ్యత తామే చూసుకుంటామన్నారు. పిల్లలకు అల్పాహారం, బిస్కట్లు, భోజనాలు సమకూర్చుతామన్నారు. తమ పిల్లల్ని చేర్చాలనుకునే తల్లిదండ్రులు సంప్రదించాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

'కొండబాబువి అవకాశవాద రాజకీయాలు'

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

మాజీ ఎంఎల్ఎ కొండబాబు పచ్చి అవకాశవాదని వైసిపి జెసిఎస్ మండల కన్వీనర్ సుంకర విద్యాసాగర్ పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడి పని చేసే కార్యకర్తల ఎదుగుదలను వనమాడి జీర్ణించుకోలేదన్నారు. ఇప్పటి కైనా కొండబాబు చుట్టూ భజన చేస్తున్న వారు గ్రహించి తొందరగా మేల్కొంటే మంచిదన్నారు. అసలు కొండబాబుకు రాజకీయ భిక్ష పెట్టిన మాజీ లోక్ సభ స్పీకర్ జిఎంసి.బాలయోగి, ఎస్ఆర్ఎంటి చౌదరి పట్ల ఏనాడైనా కృతజ్ఞత చూపించిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. టిడిపి కార్పొరేటర్లు ఇష్టాసారంగా ఆడవాళ్లను కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. సుంకర శివప్రసన్న సాగర్‌పై వారు చేసిన వ్యాఖ్యలు ఖండిస్తున్నామన్నారు. వనమాడి కొండబాబు తన హయాంలో అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచి కాకినాడ ప్రతిష్టను మంటగలిపారని ఆరోపించారు. కాకినాడ రాజకీయ చరిత్రలో మల్లాడి స్వామి, ముత్తా గోపాలకృష్ణ, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి నిబద్ధతతో పనిచేస్తే వనమాడి మాత్రం రాజకీయాన్ని వ్యాపారంగా మార్చుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి రెండు పూటలా బడులు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సోమవారం నుండి, ప్రభుత్వ పాఠశాలలు రెండు పూటలు (ఉదయం మరియు మధ్యాహ్నం) నడుస్తాయి. కాబట్టి, పాఠశాలల సమయాలు ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9:00 గంటలు నుండి సాయంత్రం 3.30 నిముషాలు వరకు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉదయం 9:00 గంటలు నుండి సాయంత్రం 4:00 గంటల వరకు నిర్వహించాలని సామర్లకోట ఎంఇఒ వై.శివ రామకృష్ణయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దస్తావేజులు పోయినవి

శ్రీమతి పెంకే శ్రీదేవి, భర్త: పెంకే శ్రీనివాసరావు, డో.నెం. 76-5-42, గానుగ వీధి, దానవాయిపేట, రాజమండ్రి, తూ॥గో॥జిల్లాలో నివసిస్తున్న నా యొక్క 1722/2009, తేదీ 20-04-2009 నెంబరు గల ఒరిజినల్ దస్తావేజు మరియు లింకు దస్తావేజు నెం. 6739/2004, తేదీ 22-09-2004, ఎస్.ఆర్.ఓ. రాజమండ్రి నెంబరు గల ఒరిజినల్ ది.22-06-2023వ తేదీన నా ఇంటి నుండి దేవీచౌక్‌లో గల కలర్ జిరాక్సు షాపుకు జిరాక్సు నిమిత్తం వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పడిపోయినది. పైన పేర్కొన్న దస్తావేజులు ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకు తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.

శ్రీమతి పెంకే శ్రీదేవి
భర్త: శ్రీనివాసరావు, డో.నెం.76-5-42,
గానుగ వీధి, దానవాయిపేట,
రాజమండ్రి. సెల్: 94409 76129

పత్రికా ప్రకటన

వాది: కొక్కిరిగడ్డ కాశీబాబు, S/o. భైరవస్వామి, బి.పి.వి.పాలెం, హెచ్.నెం.4-40.

ప్రతివాదులు:
1) Guthula Somaraju, S/o. Chitteyya
2) Saladi Anantha Lakshmi, W/o. Chinna Veerabhadra Rao

మా క్లయింట్ అయిన కొక్కిరిగడ్డ కాశీబాబు, S/o. భైరవస్వామి, డో.నెం. 4-40, కోరింగ, తాళ్ళరేవు మండలం, కాకినాడ, JCFC, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో అప్పీల్ సూట్ నెం. 215/2022, తే. 24-8-2022 దిన దాఖలు చేసియున్నాము. సదరు కేసులో ప్రతివాదులైన 1) Guthula Somaraju, 2) Saladi Anantha Lakshmi లకు కోర్టు వారి ఆదేశాల ప్రకారం నోటీసు జారీ చేసియున్నాము. సదరు కేసు విచారణలో ఉన్నది. శ్రీ 5వ అడిషనల్ జిల్లా జడ్జి, కాకినాడ కోర్టులో O.S. No. 68/2015, తే. 15-03-2022ది తీర్పు నా క్లయింట్‌కు ప్రతికూలంగా వచ్చినందున సదరు కేసుపై గౌరవ హైకోర్టులో A.S. No. 215/2022 దాఖలు పరచియున్నాము. సదరు కేసు హైకోర్టులో పరిష్కారమై తుది తీర్పు వచ్చేంతవరకు క్రింద కనబడిచిన సూట్ షెడ్యూలు ప్రాపర్టీ ఎలాంటి క్రయ విక్రయాలు జరపడం చేయరాదని తెలియపరచుచున్నాము. క్రింద కనబరిచిన షెడ్యూలు ప్రాపర్టీ నాకు సదరు వ్యక్తులు అగ్రిమెంటు ఆఫ్ సేట్ డీడ్ ద్వారా విక్రయించి వున్నారు. సదరు వివాదం పెండింగ్‌లో ఉన్నది.

షెడ్యూల్ ప్రాపర్టీ వివరములు

East Godavari District, Sarpavaram Sub-Registry, Kakinada Municipal Corporation area Gaigolupadu Village, Ward No. 29, Survey No. 157/7 out of Ac. 42 cents Northern side building bearing D.No. 69-6A-11G in 100.41 sq.yards is situated with in the following boundaries.
EAST: 7.2 feet Common Pathway. **SOUTH:** Property belongs to Guthula Malleswara Rao. **WEST:** Property belongs to Bhaskara Rao. **NORTH:** Property belongs to Pericherla Vijaya Lakshmi.

పైన కనబరిచిన ఆస్తిపై హైకోర్టులో విచారణ (అప్పీల్) పెండింగ్‌లో ఉన్నందున సదరు ఆస్తిపై సదరు వ్యక్తులు ఎలాంటి క్రయ విక్రయాలు జరిపితే తగిన చర్యలు తీసుకోబడతాయి. హైకోర్టును అతిక్రమించిన వారు అవుతారని తెలుపడమైనది.

PAVANI SIVA KUMAR, Advocate
Door No. 8-15/5, Venkateswara Nagar
II Lane, Mangaldas Nagar 2nd Street
Guntur-01, Cell: 9441767199